క్లుప్తంగా

గవర్నర్‌కు వినతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: విభజన చట్టం ప్రకారం హామీలను తక్షణమే అమలు చేస్తూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. నగరానికి వచ్చిన ఆయనను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు, సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని, ఉత్తరాంధ్ర ఫార్మా కంపెనీలో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరారు.

ఏయూను సందర్శించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎండీ రాజాబాబు

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఏయూ పూర్వ విద్యార్థి పి.రాజాబాబు శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా రాజాబాబు గుర్తు చేసుకున్నారు.

వార్డు సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్నారు. శుక్రవారం ఆయన వార్డులోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, కాలువలు, తాగునీటి సమస్యలను స్థానికులు చెప్పగా.. జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వీలైనంత వేగంగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



తీరానికి కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహం

భీమునిపట్నం: భీమిలి సముద్ర తీరానికి శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. ఇక్కడ మార్లిన్‌కే రెస్టారెంట్ వెనుకభాగంలోని తీరంలో 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ బి.సుధాకర్, ఎస్‌ఐ హరీష్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై 'రాధ' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇది ముంచే ప్రభుత్వం

- కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో ఒరిగింది సున్నా
- అమలు కాని సూపర్ సిక్స్ పథకాలు
- నెరవేరని పాలకుల హామీలు
- నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ/మద్దిలపాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులకే జనం విసిగిపోతున్నారు. కూటమి అసమర్థ, దగా పాలనపై తూర్పు నియోజకవర్గ ప్రజలు మరింత ఆగ్రహం, అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి జరగలేదు సరికదా వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన పనులను మధ్యలోనే నిలిపేస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్ల నిర్మాణం ఆపేశారు. ఇంకొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా.. వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా మూలకు చేర్చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా గాలికి వదిలేశారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇంతవరకు ఎన్నడూ లేని అత్యధిక ధరకు అమ్ముకొంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రజల వైపు కన్నెత్తి చూడటం లేదు. 100 రోజుల కూటమి పాలనలో ఏ అభివృద్ధి కార్యక్రమానికి నడుం బిగించింది



వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేసిన రైతుబజార్

లేదు. అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధిని పట్టించుకోకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారు. దీంతో నియోజకవర్గ ప్రజలు విసిగిపోయి కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు.

అభివృద్ధి నిల్.. కబ్జాలు ఫుల్

కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి జరగక పోగా.. కొందరు టీడీపీ నాయకులు కబ్జాలకు తెరతీశారు. గెడ్డలు, ఖాళీ స్థలాలపై కన్నేసి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. జీవీఎంసీ 10వ వార్డులో టీడీపీ నాయకులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. స్థానికులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే వారినే సంప్రదించాల్సిందే. 11వ వార్డులో టీడీపీ



ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో టీడీపీ నాయకులు విక్రయానికి సిద్ధం చేసిన గెడ్డ స్థలం

నాయకులు గెడ్డ స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ఇటీవల ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో గెడ్డ అంచున సుమారు 150 చదరపు గజాల స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నించారు. దీని కోసం మూడు దొంగ పట్టాలను సృష్టించారు. అధికారంలో ఉన్నామని.. మమ్మల్ని ఎవరూ ఆపేదంటూ కూటమి నాయకులు బరితెగిస్తున్నారు.



కూటమి తరఫున ఆరిలోవ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సినీ నటుడు బాలకృష్ణ, భరత్, వెలగపూడి రామకృష్ణబాబు (ఫైల్)

పథకాలు అమలు కాలేదు



ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తామన్నారు. నేటికీ ఈ పథకాలు అమలు లేదు. వృద్ధులకు పింఛన్లు తప్పా ఇంకేమీ ఇవ్వలేదు. మా ప్రాంతానికి కుళాయి నీరు కూడా రోజూ సక్రమంగా సరఫరా చేయడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా.. నాయకుల హడావిడి తప్పా ఇంతవరకు మా ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కూరగాయలు, నూనెలు ధరలు పెరిగిపోయాయి.

– కర్రి సుజాత, గృహిణి, నెహ్రూనగర్

వంద రోజుల పాలనలో ఒరిగిందేమీ లేదు



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కేవలం పెంచిన పెన్షన్లను ఇవ్వడానికే నానా యాతన పడిపోతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. నిత్యావసర సరకులు, కూరగాయాల ధరలు పెరిగిపోయి సామాన్యుడు అల్లాడిపోతున్నాడు. పథకాలు అమలు చేస్తారని చూస్తున్న ప్రజలకు ఎదురు చూపులే మిగిలాయి.

– బోను మణికంత, కేఆర్‌ఎం కాలనీ

తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలి



టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన అంశాన్ని టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో సైతం పెట్టారు. ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులవుతున్నా.. నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన లేదు. నోటిఫికేషన్లు, ఉద్యోగ నియామకాలు ఆలస్యం అవుతున్నందున రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి.

– గణేష్, విద్యార్థి నాయకుడు

మెగా డీఎస్సీ పేరుతో కాలయాపన



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం తాత్కాలిక బడ్జెట్ పేరుతో కాలయాపన చేస్తోందని అర్థమవుతోంది. 16 వేల పోస్టులు పేర్కొంటూ మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు ఇప్పటికీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన 6 వేల పోస్టులను భర్తీ చేసినా.. నిరుద్యోగులకు కొంత ఊరట లభించేంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయినా ఇంకా డీఎస్సీపై స్పష్టత ఇవ్వకపోవడం దారుణం.

– సూర్యనారాయణ, డీఎస్సీ అభ్యర్థి

అభివృద్ధిని మరిచి దందా చేస్తున్నారు



సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హామీలు నెరవేర్చక పోగా నియోజకవర్గంలో టీడీపీ నాయకులు దందాలకు దిగుతున్నారు. ఖాళీ స్థలాల ఆక్రమణ, అక్రమ కట్టడాలకు సిద్ధమై జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికార దాహంతో ప్రజలను మోసం చేశారు. ఆరిలోవ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన రోడ్ల నిర్మాణం పనులను నిలిపేశారు. నిర్మాణం జరిగిన రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురాలేక పోతున్నారు. నిత్యావసర సరకులు, కూరగాయాల ధరలు పెరిగిపోయి సామాన్యుడికి అందుబాటులో లేవు.

– గూడపాటి విక్టర్, 13వ వార్డు

అంతా తుస్..



వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు. అంతన్నారు.. ఇంతన్నారు. అంతా తుస్‌మనిపించారు. సూపర్ సిక్స్ పథకాలంటూ బ్యాటింగ్‌కు దిగి డక్కవుట్ అయ్యారు. ఒక్క పథకం కూడా కార్యరూపం దాల్చలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొటుంన్న సమస్యలను పాలకులు పట్టించుకోలేదు.

– దల్లి కనకరాజు, ఇసుకతోట

పబ్లిక్ సహకారంతో నేర నియంత్రణకు చర్యలు

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ఆరిలోవ పీఎస్‌లో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: పబ్లిక్ సహకారంతో నగరంలో నేర నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆరలోవ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి సమస్యలు, నమోదవుతున్న కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. నేరాలు త్వరితగతిన ఏవిధంగా నియంత్రించాలో సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా సీపీ విలేకరులతో మాట్లాడుతూ నేర నియంత్రణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లను సందర్శిస్తున్నట్లు చెప్పారు. నగరంలో రౌడీషీటర్లు బయట తిరగడానికి వీలులేకుండా జైల్‌కు పంపిస్తున్నామన్నారు. ప్రశాంతమైన విశాఖలో నేరాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు నేరాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. నగరంలో సమస్యాత్మకమైన ఆరిలోవ పోలీస్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి చారిస్తున్నట్లు తెలిపారు. దీని పరిధిలో ఎక్కువ అటవీ ప్రాంతం ఉండటం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి ఆసరాగా మారిందన్నారు. పీఎస్ పరిధిలో ఎండాడ, జూ పార్కు, కంబాల కొండలు, సాగర్ నగర్, ముడసర్లోవ తదతర ప్రాంతాల్లో రాత్రి వేళ చీకటి ఉంటుందన్నారు. అలాంటి ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌కు తెలియజేశామని చెప్పారు. కొత్తగా విమ్స్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను త్వరలో ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ వద్ద ఫండింగ్ లేకపోవడంతో సీఎస్‌ఆర్ నిధుల కోసం వేరే సంస్థలను సంప్రదించామని తెలిపారు. ఆరిలోవ, పీఎం పాలెం, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లకు సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడతున్నామని సీపీ పేర్కొన్నారు.

భారీ అన్నసమారాధన



నేతాజీనగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి నేతాజీనగర్‌లో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షించాలి



మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

ఆరిలోవ: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులపై ఉందని డిస్ట్రిక్ట్ లీగల్ అథారిటీ అసోసియేషన్ సెక్రటరీ, సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతల గురించి వివరించారు. పాఠశాలల్లో ఫిర్యాదులు పెట్టె ఆవశ్యకత, పోక్సో చట్టం, మంచి చెడుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమన్నారు. మంచివారితో స్నేహం చేయాలని, చెడ్డవారికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, జిల్లా గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కాలేష బేగం, సర్వశిక్ష ఎంఐఎం కో ఆర్డినేటర్ డి.అప్పలనాయుడు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.రామకృష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర సంరక్షణతోనే జీవుల మనుగడ



మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

విశాఖ సిటీ: జీవుల మనుగడ ఓజోన్ పొరపైనే ఆధారపడి ఉంటుందని, దీనిని సంరక్షించుకోవాలని ఆంధ్రా యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా పూర్వ విద్యార్థుల కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఓజోన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి ఓజోన్ పొర క్షీణత, పర్యవసానాలను విశదీకరించారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యుడు ఇ.ఉదయభాస్కరరెడ్డి ఓజోన్ పొర పరిరక్షణ, క్షీణించడం వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జి.శుభాషిణిదేవి, విశ్రాంత ఆచార్యుడు ఎ.జె.సాల్మన్‌రాజు, అడ్జంక్ట్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి వగీర, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకు రావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఆశ కార్యకర్తల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశం ప్రతి 3 నెలలకు ఒకసారి జరుగుతుందని తెలిపారు. ఆశ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, వివిధ విభాగాల అధికారులు ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, బి.నాగభూషణం, శశిభూషణ్, మణికుమారి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మేనేజర్స్ డే

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సమత డిగ్రీ కళాశాలలో శుక్రవారం వరల్డ్ మేనేజర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సమయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి టెక్ మహీంద్రా డెలివరీ విభాగం హెడ్ రవిచంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ విధ్వంసం ఆపాలి



బీచ్ రోడ్డులో నిరసన ర్యాలీ చేస్తున్న క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ సభ్యులు

బీచ్‌రోడ్డు: అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసం చేయడమే విపత్తులకు కారణమని క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ సభ్యులు నినాదించారు. దేశంలో జరుగుతున్న అటవీ ఉద్యమాలకు సంఘీభావంగా శుక్రవారం ఆర్కే బీచ్ రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం, వడగాల్పులు, కాలుష్యం, తీవ్ర తుపానులు వంటికి ప్రకృతి కోపానికి కారణమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు అనిల్, ఓద్రిల్ల, అంజన తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో వ్యాధులు దూరం



మొక్కల కుండీలను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల నుంచి రక్షణకు ప్రతి శుక్ర, మంగళవారాల్లో ప్రజలంతా డ్రైడే పాటించాలని జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. డ్రైడే రోజు ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, చైతన్యనగర్ కాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి వాటి తొలగించాలన్నారు. ఫ్రిడ్జ్, ఏసీల ద్వారా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేసుకోవాలని నివాసులకు సూచించారు. వారం రోజులు దాటి నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తికి ఆవాసంగా మారుతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వ్యాపిస్తాయని, ముందు జాగ్రత్తలతో రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

'వండర్ కిడ్స్'కు ఇన్నోవేటివ్ స్కూల్స్ అవార్డ్



అవార్డ్ స్వీకరిస్తున్న స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు

మహారాణిపేట: మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్స్ అవార్డుతో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ మెరిసిందని డైరెక్టర్ మళ్ల రామునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్, ఎక్స్‌పో సెంటర్‌లో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు పాల్గొని ఇంగ్లిష్ ఆల్ఫాబెట్స్‌ను వేగంగా నేర్చుకునే పేపర్ ప్రెజెంటేషన్ ప్రదర్శించారు. భారతీయ శిక్షా బోర్డ్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.పి.సింగ్ నుంచి మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఎడ్యుకేషన్, హర్యానా చైర్మన్ డాక్టర్ వి.పి.యాదవ్, నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్ చైర్మన్ కులభూషణ్ శర్మ మాట్లాడుతూ అందరికీ విద్య, ఉజ్వలమైన, సాధికారత కలిగిన భవిష్యత్తును నిర్మించడంలో ఇటువంటి ఆవిష్కరణలు, విలువైన రచనలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

నేడు మహా అన్నదానం

సీతంపేట: దుర్గాగణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సీతంపేట కూడలిలోని ఆలయం వద్ద మహా అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

కొత్త రేషన్ డిపోలు వద్దు

మహారాణిపేట: జిల్లాలో కొత్తగా రేషన్ డిపోలు ఏర్పాటు చేయవద్దని, ప్రస్తుతం ఉన్నవే సర్దుబాటు చేయాలని జిల్లా చౌకధరల దుకాణ డీలర్ల సంఘాలు వేర్వేరుగా కోరారు. శుక్రవారం ఈ సంఘాలు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఎస్‌వో సూర్యప్రకాశరావుకు వినతి పత్రాలు సమర్పించారు. కొత్తగా 61 డిపోలు ఏర్పాటు చేస్తే తాము ఇబ్బంది పడతామన్న అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు జిల్లా సంఘం అధ్యక్షుడు పి.చిట్టిరాజు తెలిపారు.

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీవోఈ) ఎంఏ (ఇంగ్లిష్), బి.ఎ., బి.కాం. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి గడువును పొడిగించినట్లు డైరెక్టర్ డా.టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచే దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశం దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15లోపు అందజేయాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం https:// cdl.gitam.edu/ Welcome.aspx ను సందర్శించాలని సూచించారు.

యునెస్కో సదస్సుకు ఇంటాక్ కన్వీనర్



డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: యునెస్కో, జీఎస్‌ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్(ఇంటాక్) విశాఖ చాప్టర్ కన్వీనర్, జియో హెరిటేజ్ అడ్వైజ డి.రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఢిల్లీలోని యునెస్కో హౌస్‌లో సెప్టెంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు 'ఫస్ట్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కమ్ వర్క్‌షాప్ ఆన్ యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్' జరగనుంది. ఈ సందర్భంగా జరిగే చర్చావేదికలో జియోపార్క్‌ల మూలాలు అనే అంశంపై ప్రసంగించేందుకు రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. మొదటి రెండు రోజులు వర్క్‌షాప్ జరుగుతుందనీ.. చివరి రోజున రాజస్థాన్‌లో క్షేత్ర స్థాయి పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. భారత్‌లో గ్లోబల్ జియోపార్క్‌లు ఏర్పాటు చేసేందుకు యునెస్కో తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమని.. ఈ వర్క్‌షాప్‌కు ఆహ్వానం లభించడం సంతోషంగా ఉందని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.